# 'జానీ'

సన్నిహితులం మేము వాణ్ణి 'జాన్' అనిపిలిచేవాళ్లం. నేను 'జానీ' అనేవాణ్ణి. వాడు నాకన్నా చిన్నవాడు.

ఆరడుగుల మనిషి. స్ఫురద్రూపి. మంచి మేధ కలిగినవాడు. ఇంజనీరింగ్ పూర్తికాగానే మనసుకు నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. షార్ట్ సర్వీస్ కమిషన్ రాసి మిలట్రీలో చేరిపోయాడు.

వాడికి పెళ్లైన సంవత్సరానికి అందమైన బాబు పుట్టాడు.

'ఇద్దరూ లేక ముగ్గురు'నించీ 'ఒక్కరు లేక ఇద్దరు' వరకు వచ్చిన కుటుంబ నియంత్రణ జానీ దగ్గరికి 'ఒక్కరూ లేక ఎవ్వరూ వద్దు'గా చేరుకుంది. బాబు పుట్టగానే ఆపరేషన్ చేయించుకున్నాడు.

మిలటరీ నించీ కెప్టెన్‌గా రిటైరయ్యాడు. తర్వాత స్టేట్‌బ్యాంక్ జోనల్ సెక్యూరిటీ ఆఫీసర్గా తిరుపతిలో ఉద్యోగం చేపట్టాడు. వాడి భార్యకు కూడా గౌరవప్రదమైన ఉద్యోగం అయిదంకెల జీతంతో వచ్చింది. అడపాదడపా కర్నూలు వచ్చేవాడు. వచ్చిన ప్రతిసారీ కలిసి చిన్నప్పటి ముచ్చట్లూ, మిలటరీ విశేషాలూ అవీ ఇవీ అన్నీ మాట్లాడేవాడు.

కొన్నేళ్ల కిందట వాడి జీవితంలో ఓ అద్భుతం జరిగింది. మదర్ థెరిసా తిరుపతి వచ్చినప్పుడు జానీ ఇంటికి వెళ్లింది. ఆమెతో గడిపిన రెండు గంటల కాలం వాడిలో ఓ మహోత్కృష్ట కార్యానికి ప్రేరణ అయ్యింది. మదర్ థెరిసా సలహా మేరకు ఓ పాపను దత్తత తీసుకోవడం ఆ కార్యం. ఓ శుభముహూర్తాన నాకు తిరుపతి నించీ ఫోన్. 'నువ్వు' అర్జెంటుగా రా' అని. వెంకటాద్రి ఎక్కివెళ్లా... అక్కడ జాన్ దంపతులు నన్ను ఓ అనాథాశ్రమానికి తీసుకెళ్లారు. అక్కడ ఓ ముద్దుల మూటగట్టే, ఓ పసిడి ముద్దలాంటి పాప... బుల్లి నోరూ బుల్లి బుల్లి పిడికెళ్లూ పాదాలూ... ఏ తల్లి కని పారవేసిందో, పారవేయడానికి ఆమెకున్న కారణాలేమిటో మనకనవసరం. 'ఈ పాపను అడాప్ట్ చేసుకోవాలనుకుంటున్నాం' అని ప్రకటించాడు జానీ... ఒక్కసారి వాణ్ణి వాటేసుకున్నాను.

దత్తు రిజిస్ట్రేషనప్పుడు మొదటి సాక్షి సంతకం చేసింది నేనే.

అనాథ అయిన ఆ పాపకు తల్లీ, తండ్రీ, అన్నా, ఓ ఇల్లూ, ఓ అందమైన ప్రపంచం లభించాయి.

ఆ శుభావసరాన పెద్ద విందు ఏర్పాటుచేసారు జాన్ దంపతులు. ఆహూతులు అందరూ వెళ్లిపోయింతర్వాత బీరువాలోంచి బాటిల్ తీసాడు జానీ.

'ఈరోజు కూడానా' అంది జానీ భార్య బాధగా.

మిలటరీలో అయిన అలవాటు... అది చిన్నచిన్నగా వాణ్ణి మింగేయడం మొదలైన రోజులవి. పైగా కెప్టెన్గా రిటైరయ్యాడు కదా. ప్రభుత్వమే సారా తాగమని అతి చవగ్గా సీసాలకు సీసాలు క్యాంటిన్ ద్వారా సప్లయ్ చేస్తుంది.

ఆ రోజున వాణ్ణి చూస్తే నాకు భయమేసింది. అంతగా వద్దని చెప్పాను. ఆ రాత్రే బస్సెక్కి కర్నూలు వచ్చేసాను. ఇది జరిగి పధ్నాలుగేళ్లైంది.

మధ్యమధ్యలో వాడు కర్నూలు వస్తూనే వున్నాడు. పాపను కూడా చాలాసార్లు కర్నూలు పిలుచుకువచ్చాడు.

ఓ నాలుగేళ్ల క్రితం మిత్రుడు శంకర్ తిరుపతి నుంచి ఫోన్చేసాడు. 'స్టీఫెన్ (జానీ అసలుపేరు) విపరీతంగా తాగుతున్నాడు. తాగి బ్యాంకుకు కూడా వెళ్తున్నాడు' అని.

జానీ కర్నూలు వచ్చినప్పుడు నేనూ, మా జయక్కా కూచోపెట్టి నచ్చచెప్పాం.

'మానేస్తా మానేస్తా' అన్నాడు. దాం తర్వాత ఆధ్యాత్మిక సలహా కూడా తీసుకున్నాడు. అదీ సరిపోక A.A. (Alcoholics Anonymous) లో చేరాడు. ఊహూ ఫలితం శూన్యం.

* * *

ఓ నాలుగు నెలల క్రితం.

ఉదయం అయిదున్నరా ఆరు ప్రాంతం...

ఫోన్ రింగౌతూంటే విసుగ్గా ఫోనెత్తాను. తిరుపతి నించీ

'స్టీఫెన్ యీజ్ నో మోర్'

కళ్లనించీ రెండు చుక్కలు రాలిపడ్డాయి. ఎలాంటి వాడు, ఎంత మంచి మనసున్నవాడు ఎక్కడో అనాథగా పడివున్న పసిదాన్ని తెచ్చి అక్కున చేర్చుకున్న సహృదయుడు జానీ చనిపోయాడు. అదీ సహజ మరణం కాదు మద్యం కోరల్లో చిక్కుకుని.

ఆ పాపకిప్పుడు పదిహేను పదహారేళ్లు. జీవితాన్నిచ్చిన తండ్రిన పోగొట్టుకుంది. సరే ఆ పాపకు ప్రపంచముంది. తల్లీ వుంది, అన్న ఉన్నాడు అదో ఊరట.

మరి నాకు ప్రియ మిత్రుడు ఎక్కడ? ఎలా? ●